"నాన్నా! శుభ లేఖ."

నిర్లిప్తమైన ఓ నవ్వు వెలిసింది జోగారావుగారి గంభీర వదనంలో.

ఆ నవ్వుకి నిర్వచనం బహుశః ఆయన కూడా ఇచ్చుకోలేరేమో?

ఆ నవ్వులో జీవం లేదు.

ఆ నవ్వులో కళ లేదు.

ఆ నవ్వులో నవ్వు లేదు.

అది అందరూ నవ్వగలిగే నవ్వుకాదు, ఏ కొద్ది మందో తప్ప.

జీవితంతో రాజీపడ్డ జోగారావుగారికి అటువంటి నవ్వులు నవ్వటం కొత్తేం కాదు.

ఈ మధ్య ఓమారలాగే జ్యోతి—"నాన్నా! మా ఫ్రెండ్ పెళ్ళికి వెళతా, నాన్నా" అన్నప్పుడు కూడా అటువంటి నవ్వే నవ్వారు.

ఆ నవ్వులోని అర్థాన్ని గ్రహించలేని జ్యోతి సంబరపడిపోయింది, పిచ్చిపిల్ల—తన కున్న లాంటి నాన్న మరింకెవ్వరికీ లేడనీ.

పెళ్ళికాకుండా చివరగా మిగిలిన ముద్దమ్మాయి జ్యోతి సంబరాన్ని చూసి నపుడు కూడా అలాగే నవ్వారు మళ్ళీ.

"ఏమమ్మా! ఎప్పుడు పెళ్ళి?"

"రెండు రోజు లుంది, నాన్నా!"

పెళ్ళికి పంపించకపోతే ఘాడు రోజులు భోజనం మాని పడుకుంటుందని తనకి తెలుసు. చక్కని తెలివితేటలలో ప్రతి క్లాసులో ఫస్ట్‌గా వస్తూ తండ్రి అభిమానాన్ని, ఆప్యాయతని చూరగొన్న, పదవ తరగతి చదువుతున్న జోగారావు గారి ముద్దమ్మాయి జ్యోతి ఈరోజలా భోజనం మాని పడుకుంటే తను చూడలేడని కూడా తనకి తెలుసు. అందుకే ఆయనకు ఏం చేయాలో అర్థం కాలేదు. జీతాలు మరో నాలుగు రోజు లున్నాయి. తన పిచ్చి కాకపోతే తను జీతాలకోసం ఆలోచించడ మేమిటి! తను ఇంటికి తెచ్చేది మహా అయితే పాతిక రూపాయలు, అప్పటికీ కొన్ని బాకీలు తీర్చకుండా ఉంటే. కూతుర్ని పెళ్ళికి పంపించాలంటే కనీసం రెండు పదులైనా చేతిలో పెట్టాలి. అంటే అప్పుడైనా ఇంటి ఖర్చులకోసం అప్పు చేయాలి; తప్పదు.

అందుకే ఆ రోజు తన శక్తితో లక్ష్మికి కొనగలిగిన ఒక్కగా నొక్క గొలుసును తాకట్టు పెట్టినప్పుడు, ఎన్నాళ్ళనుంచో బాధపడటం మరిచిన తను కొద్దిగా బాధపడ్డారు. అయితే, ఆ రోజు కూడా ఆయన ఏడ్వలేదు. ప్రాణంలేని నవ్వు నవ్వారు.

అటువంటి నవ్వే మళ్ళీ ఇప్పు డోసారి నవ్వారు.

"ఏరా! ఎవరిదిరా ... అది?"

"మా ఫ్రెండ్‌ది, నాన్నా! మేమిద్దరం



విజయనగరంలో ఇంటర్ చదివేటప్పుడు ఒకే క్లాసు కుర్రాళ్ళం. వాడితోనే విజయనగరంలో కలిసి ఉండేవాడిని. వాడిది విజయనగరం దగ్గరే మరదాం అని చిన్న పల్లెటూరు. పెళ్ళికూడా అక్కడే.''

జోగారావుగారికి ఏం చెప్పాలో తోచ లేదు.

''వెళతా, నాన్నా ...'' ఇంటి పరిస్థితులు తెలిసి తన నెందు కలా అడుగుతున్నాడో, ఎలా అడగగలుగుతున్నాడో అర్థం కాలే దాయనకి. చిన్న పిల్లాడైతే ఏ విధంగానైనా నచ్చ జెప్పి, వినకపోతే లెంపకాయ కొట్టయినా నోరు మూయించే వారే.

కాని, తన కొడు కిప్పుడు చిన్నవాడేం కాదు.

డిగ్రీ చదువుతున్నాడంటే ఆ మాత్రం జ్ఞానం వాడిలో ఉండాలి కాని, ఆయన నోరు విప్పి ప్రత్యేకంగా చెప్ప వలసిన దేముంది? మొన్న ఫర్స్ట టెర్మ్ ఫీజు ఫైన్‌తో ఎందుకు కట్టాడో తెలియదా! లేకపోతే, చిన్న పరీక్ష ఫీజు కట్టడానికి వాడి తండ్రి ఏం చేశాడో తెలియదా? అంత కంటే ప్రత్యక్షంగా ఏం చూపెట్టాలి, ఇప్పుడు దేనికైనా డబ్బులు అవసరం వస్తే అప్పు చేస్తేగాని కాదని.

నవ్వుకున్నారు నోటి మాటరాక.

''ఏరా! అంత తప్పని సరా?'' అన్నారే గాని, తనకి మూడు రోజుల క్రిందట సంఘటన మనస్సు లోనే ఉంది.

''చూడండి, అన్నయ్యగారూ! తప్పకుండా వస్తారు కదూ?''

''లేదమ్మా! మీ వదిన్ని, పిల్లలని పంపిస్తాను. నాకు సెలవు దొరకదు'' ఏదో అనేశారు గాని, పిల్లలని పంపటం కూడా తన కిష్టంలేదు. లక్ష్మి ఒక్కర్తనే పంపి సరిపెట్టెయ్యాలని అతని ఉద్దేశ్యం.

''అదేం కుదరదు. మీరు రావలసిందే. మీరు రాక పోతే అసలు పెళ్ళే జరుగదు'' అందావిడ. నవ్వుతూ.

''అదిమాత్రం చేయకండి. ఈ రోజుల్లో ఆడపిల్లకి పెళ్ళిజరగటం మంటేనే మహా కష్టం అయిపోతోంది. ఆ పెళ్ళిగాని తప్పితే, శాక నా మీద పడతారు నన్ను కట్టుకోమని'' అన్నారు జోగారావుగారు, ఆయన 'నవ్వు' నవ్వు కుంటూ.

కుడితిలో పడ్డ ఎలుక పిల్ల వంటి పరిస్థితి ఆయనకి బాగానే గుర్తు. ఆ రోజా వెళ్ళక తప్పలే దాయనకి.

''మా ఫ్రెండ్స్ అంతా వెళుతున్నారు, నాన్నా! నేను కూడా తప్పకుండా వస్తా నని ...''

'ప్రామిస్ చేశావ్. అంతేనా? కాని, అలా ప్రామిస్ చేసే ముందు, ఇంటి పరిస్థితులు కాస్త ఆలోచించావా? ఎలా వెళ్ళాలనుకున్నావ్? నీ వినోదాలకీ, విందులకీ మీ నాన్న ఎక్కడి నుంచి తెచ్చి ఇస్తా డనుకున్నావ్. మొన్న నీ కాలేజీ ఫీజుకి, పరీక్ష ఫీజుకి మీ నాన్న అప్పు చేయటం చూసే అలా ప్రామిస్ చేశావా? ఒరేయ్! వాళ్ళందరూ ఆఫీసర్లు, జమీందార్ల బిడ్డలురా. కాని, నువ్వో? కేవలం... కేవలం ఓ బడిపంతులు కొడుకువిరా! వాళ్ళతో ప్రతీదానికీ ఎక్కడ సరితూగగలవురా? నేను ఎన్ని కష్టాలు పడి నిన్ను డిగ్రీ చదివిస్తున్నానో నీకు తెలియదట్రా? మరి ఇప్పుడు ఈ పెళ్ళిళ్ళకీ, పార్టీలకీ వెళ్ళకపోతేనేం?' అని ఏ దేదో అందా మనుకున్నారు. ఒక్క మాటా పైకి అనలేకపోయారు.

ఫ్రెండ్ పెళ్ళికి పంపించటానికి ఇన్ని మాటలు అనేస్తే తన కొడుకు వ్యక్తిత్వం దెబ్బ తినదూ? చేసిన ప్రామిస్‌ను నిలబెట్టుకోకపోతే తన కొడు కొక అసత్యవంతుడై పోడూ?

నవ్వుకున్నారు మనస్సులోనే, త నలా అడిగితే కొడు కిచ్చే సమాధానాన్ని ఊహించుకొంటూ.

''ఊఁ. వెళ్ళిరా'' అన్నారు చివరికి, గంభీరంగా కుర్చీలో వెనక్కి చేరగిలపడుతూ, కొడుకు ముఖంలోని రంగులు మారటం గమనించి.

* * *

తన గదిలో కూర్చుని పాత ఉత్తరాలన్నీ తిరగవేస్తున్నారు జోగారావుగారు నిర్జీవంగా.

మనస్సు బాగులేక పోయినప్పుడల్లా అలా ఉత్తరాల మీద పడటం, ఒక్కొక్క ఉత్తరం వెనక నున్న గతాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఆ కాస్తసే పూ

**పల్లంటి శ్రీనివాసరావు**

మనస్సుని తేపి చేసుకోవటం ఆయనకి అలవాటే.

ఆయన గతం ( పెళ్ళికాకముందు ) అంతా తియ్యగానే గడిచింది మరి!

కాని, ఈ రోజా కూడా అలానే మనస్సు బాగులేక పోవటంతో, అలా తన రూములోనికి వెళ్ళిన జోగారావుగారికి వచ్చుగా పది శుభలేఖలు దర్శన మివ్వటంతో అర్థం కాని నవ్వు నవ్వారు, వాటిని నిర్జీవంగా పరిశీలిస్తూ.

ఏ రోజా కారోజే కష్టంగా గడుస్తున్న తనకి ఈ శుభలేఖలు మాత్రం రోజా కొకటి తప్పటం లేదు.




జాతి నిర్మాత — చిత్రం—ఎ. ప్రభాకర్ ( జగిత్యాల )

పాపం! తన స్నేహితులెవరైనా శుభలేఖ పంపిస్తే వెళ్ళలేక పోయిన తను, తన కూతుళ్ళకి, కొడుకులకి వచ్చే శుభలేఖల్ని కాదనలేక పోయేవారు. అప్పు చేసైనా వారిని పంపక తప్పేది కాదు.

''ఏమిటండీ! ఎంత పిలుస్తున్నా అలా శుభలేఖలతో మునిగిపోయారేమిటి?'' విసుగ్గా అరిచింది భార్య లక్ష్మి. జోగారావుగారు ఎప్పటికీ పలక్క పోవటంతో.

ఉలిక్కిపడ్డారు. తన భార్య అన్ని సార్లు కేక వేసిందంటే నమ్మలేక పోయారు. ''ఆఁ. ఏం కావాలి?'' అన్నారు తెప్పరిల్లుతూ.

''ఏం లేదండీ. మా తమ్ముడి పెండ్లికి ఎప్పుడు బయలుదేరతాం'' అంది, ముందు విసుక్కున్నందుకు నొచ్చుకున్నట్టుగా.

అగ్ని పర్వతాలు బద్దలైనట్లని పించిం దాయనకి. స్వయంగా తను, తన భార్యకు శుభలేఖ ఇచ్చినప్పటికీ తన కా విషయమే గుర్తులేదు. నవ్వుకున్నారు తన మతిమరుపుకి.

నిజమే! తను తన బావమరిది పెళ్ళికి వెళ్ళాలి. పెళ్ళి మరో పదిహేను రోజులుంది. ఎలా వెళ్ళటం? కుటుంబమంతా వెళ్ళటం అసాధ్యమైన పని! కాని, వెళ్ళక తప్పదు. ఏం చేయాలో తెలియక గట్టిగా తల పట్టుకున్నారు, కుర్చీలో వెనక్కి చేరబడుతూ.

''పది రోజులు ముందుగానే రమ్మని వ్రాశారు. జ్యోతి, నేను ముందుగా పోతాం. పెళ్ళి ముందు సెలవు పెట్టి మీ తండ్రి, కొడుకులు రండి. ఏమండీ?''

''ఏదో చేద్దాం. ముందు కొంచెం కాఫీ పెట్టు.''

భార్య అలా మాట్లాడేస్తూంటే మరి కాస్సేపటికి తల బద్దలవుతుం దేమోనని భయపడ్డారు.

ఎలా చెయ్యాలో,. ఏం చెయ్యాలో ఆలోచించలేకపోతున్నారు.

'ఏమిటి ఈ పెళ్ళిళ్ళు! జీవితంలో ఒక భాగస్వామిని ఎన్నుకునేందుకు ఇంత అట్టహాసం దేనికి? నిన్నటివరకూ గంజి నీళ్ళు కరువైనా, పెళ్ళిమాత్రం వైభవంగా జరగాలంటారు. అసలు వేటి

సగటు వ్యక్తి జీవితంలో ముఖ్యంగా వేధించి, చిత్రహింస చేసే సమస్యల్లో ఇదొకటి కాదూ? ద చ అసలు ఈ వ్యవస్థ ఎప్పుడు పోతోందో! రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సింపుల్‌గా పెళ్ళి చేసుకోవడమంటే అదో చిన్నతనం'

ఎందుకో ఆ ఆలోచన రాగానే నవ్వుకున్నారు. నిజమే! తన కిప్పుడు చేతిలో నాలుగు పైసలు లేవని అలా ఆలోచిస్తున్నారే తప్ప మరి తనుమాత్రం పెద్దమ్మాయి పెళ్ళి వైభవంగా జరిపించలేదూ? అప్పుడు చేసిన అప్పు మొన్నటి వరకూ తీరనేలేదు. తరవాత అమ్మాయి విషయం అంటే అది లౌ మారేజి కాబట్టి రిజిస్ట్రార్ ఆఫీస్‌లో తనకి తెలియకుండా అయిపోవటం, తెలిసిన తరవాత సింపుల్‌గా తను నాలుగు అక్షతలు వేయటం జరిగిపోయింది గాని, లేకపోతే ఆ పెళ్ళి కూడా ఘనంగా (ఏదోలా బాధపడి) చేసే వారు కాదూ?

కాని, ఇప్పుడేం చేయాలి. పెళ్ళికి వెళ్ళటం మానేస్తేనో? నిజమే. మొన్నంటే మొన్న తన స్నేహితుని దగ్గరి నుంచి శుభలేఖ వస్తే తను మానేయలేదూ? పరిస్థితులు బాగుండి వెళ్ళగలిగినన్నాళ్ళూ ప్రతి పెళ్ళికీ వెళ్ళలేదూ? కాని, ఇప్పుడు ఇటువంటి పరిస్థితుల్లో వెళ్ళకపోలేనేం? ఒక నిశ్చయానికి వచ్చారాయన. అదే మాట భార్యతో అన్నారు.

"అదేమిటండీ! స్నేహితుల పెళ్ళికి కొడుకు, కూతుళ్ళను పంపించినపుడు లేదు గాని, ఇప్పుడు మా తమ్ముడి పెళ్ళికి మాత్రం లడ్డు చెబుతున్నారు. బాగుందండీ! ఔనుమరి! అక్కడికి నేను, నా తమ్ముడు పరాయి వాళ్ళం అయ్యాం."

"ఇప్పుడు నిన్ను పరాయి దానివని ఎవరన్నారే? కాస్త జ్ఞానం ఉండి మాట్లాడుతున్నావా, లేదా? ఇప్పుడు ఎలా వెళ్ళాలని నీ ఉద్దేశ్యం?"

"అవునులెండి. జ్ఞానముంది కనకనే ఇప్పుడు మా తమ్ముడి పెళ్ళికి ఎలా వెళ్ళాలని అడుగుతున్నారు. ఏం, ఇంత వరకూ మీ పిల్లలని ఎలా పంపించారో తెలియదా? ఇప్పుడేనా మీకు ఏం చేయాలో అర్థంకానిదీ. ఎలా వెళ్ళాలో అర్థంకానిదీను."

"అది కాదు, లక్ష్మి! కాస్త అర్థం చేసుకొని మాట్లాడు. ఇప్పు డీ పరిస్థితుల్లో ఎలా వెళతావో ఆలోచించు. కనీసం ఏదైనా వస్తువు మీద తేవడానికైనా ఏముంది చెప్పు? ఎప్పుడూ పిల్లలని పంపిస్తున్నావే అని ఆలోచిస్తున్నావే తప్ప, మొన్న నాతో పనిచేస్తున్న రాజశేఖరం పెళ్ళికి ఎందుకు వెళ్ళ లేదో ఆలోచించావా? ఇప్పుడు వెళ్ళాలంటే చేతిలో కనీసం వంద రూపాయలైనా ఉండాలి. ఎలావస్తాయో ఆలోచించు?" నచ్చజెప్పే ధోరణిలో మాట్లాడారు ఓర్పుగా.

"నిజమేనండీ! మీ తండ్రి, పిల్లలకి అవసరమొస్తే ఎక్కడైనా అప్పు దొరుకుతుంది. అప్పుడు తాకట్టు పెట్టడానికి ఏమైనా దొరుకుతాయ్. మీకు వెళ్ళాలని లేదు అని చెప్పడానికి ఈ డొంక తిరుగుళ్ళు దేనికండీ?"

"ఛీ! నోర్ముయ్!! నీకు చెప్పింది నోరులేని జంతువుకు చెప్పినా అర్థం చేసుకుంటుంది. నీ తమ్ముడంటే నీకే ప్రేమన్న మాట. ఛీ ఛీ! చేతనైతే పక్క నెవరిదగ్గరైనా ఉంటే అడిగి బయలుదేరు."

"బాగుంది వరస! మధ్య నన్ను అప్పు చేయమంటా రేమిటి? నా కెవరిస్తారని! అయినా, మీ కంత పంపించాలనుంటే మీ దగ్గర ఉంగరాన్నుంచి ఎక్కడైనా తేవచ్చుగా?"

"లక్ష్మి!!" అనుకోకుండా లక్ష్మి ఛెంప ఛెళ్ళుమంది.

"హుం. ఎంతో అభిమానంతో ప్రజెంట్ చేయబడ్డ ఉంగరాన్ని తాకట్టు పెట్టమంటావా? రాజు అంటే ఎవరనుకున్నావే! నా ప్రాణ స్నేహితుడే!! ప్రాణంతో సమానమైన ఈ ఉంగరాన్ని తాకట్టు పెట్టి నా ప్రాణాన్ని పోగొట్టుకోమంటావా? ఇప్పటికే సగం ప్రాణంలేక జీవచ్ఛవంలా బ్రతుకుతున్నానే! ఉన్న ప్రాణాన్ని కూడా ఎలా పోగొట్టుకోను?" దుఃఖమంతా ఒక్కసారే పెల్లుబికిందాయనికి.

ఆయన మళ్ళీ మామూలు మనిషి అయేందుకు చాలా సమయం పట్టింది. తరవాత ఏం నిశ్చయించుకున్నారో మర్నాడే —

"చూడు, లక్ష్మి, సెలవు దొరికితే ముందు రోజు వస్తాను. నా గురించి చూడద్దని మీ తమ్ముడికి చెప్పు". అని పెళ్ళికి పంపించారు భార్యని.

"పోస్ట్!"

మర్నాటి పెళ్ళికి బయలుదేరబోతున్న జోగారావుగారు పోస్ట్ అన్న కేక విని వేంకటరమణమూర్తికి మొక్కుకున్నారు, అది శుభలేఖ కాకూడదని.

అందుకు విరుద్ధంగానే జరిగింది. వేంకటరమణ కరుణించలేదు, ఆయ న్నింకా శుభలేఖలతోనే చిత్రహింస చేయాలనుకున్నాడేమో!

అది మామూలు శుభ లేఖ కాదు.

అది జోగారావుగారు లాంటి బడి పంతుళ్ళకి వచ్చే శుభ లేఖ అంతకన్నా కాదు.

ఆ ఒక్క శుభలేఖ కయ్యే ఖర్చు జోగారావుగారి లాంటి కుటుంబంలో ఒక పూట భత్యానికి సరిపోతుంది.

అది మంచి ధనవంతుల కుటుంబంలోంచి వచ్చిన శుభలేఖలా ఉం దది.

జోగారావుగారు ఆశ్చర్యపోయారు.

తన చుట్టాల్లో ఎవరూ అంత ఖరీదైన వారు లేరు. పోతే స్నేహితులు, కొలీగ్స్‌లో తనకు తెలిసి, పెళ్ళి కావలసిన వారు ఎవరూ లేరు.

అటువంటప్పుడు అది ఎవరిదై ఉంటుందో అర్థం కాలే దాయనకి.


బహుశా తన పిల్ల లెవరికో వచ్చి ఉండాలి.

ఆ ఆలోచన రావటంతో అతనికి పట్టరాని కోపం వచ్చింది. శుభలేఖ ఎంత ఖరీదైంది అయితే ప్రజెంటేషన్ ఎంత ఖరీదైంది ఉండాలో ఊహించలేక పోయారు.

తమ అంతస్తు గ్రహించకుండా పెద్ద అంతస్తు, ఐశ్వర్యం గల కుటుంబీకుల పిల్లలతో స్నేహాన్ని ఏర్పరచుకున్న తన పిల్లలను చూస్తే హృదయం భగ భగ మని మండింది.

"చూడండి! కాలేజిలో జాయిన్ చేయండి అని అల్లరి పెట్టటం కాదు. కష్టపడి చదవాలి. అడ్డమైన వాళ్ళతో స్నేహాలు మానాలి. అక్కడికొచ్చేవారందరూ బాగా ఉన్నవాళ్ళే వస్తారు. అటువంటి వాళ్ళతో స్నేహాలు చేసి చెడు తిరుగుళ్ళు తిరిగితే పనికిరాదు. అంతే కాదు. స్నేహం చేయటమంటే మాటలు కాదు. ఈ రోజు వాళ్ళు టిఫిన్ ఇప్పిస్తే, మీరు రేపు వారికి టీ ఇచ్చే స్థితిలో ఉండాలి" అని ఎన్నో రకాలుగా వార్నింగ్

యద్దనపూడి సులోచనారాణి
ప్రేమలేఖలు నవల ... రు 12-00
కావిలిపాటి విజయలక్ష్మి నవలలు
చక్రపాణి ....... రు 9-00
తృప్తి ....... రు 6-50
గోవిందరాజు సీతాదేవి నవల సన్మానం ... రు 6-00
పై వెల మా. M.O. పంపిన పోస్టు ఖర్చులు ఉచితం. V.P. పద్ధతి లేదు.
క్వాలిటీ పబ్లిషర్సు, రామమందిరం వీధి, విజయవాడ-2



గాలిలో ... ఫోటో—ఎల్. ఆర్. గ్రోవర్ (రోహతాక్)

ఇచ్చి మరీ చేర్పించారు కాలేజిలో, ముందు జాగ్రత్తకోసం.

అయినప్పటికీ తన పిల్లలు అంత ఐశ్వర్యవంతుల బిడ్డల స్నేహం ఏర్పరుచుకున్నారా!

కయ్యానికైనా, వియ్యానికైనా సరితూగ గలిగే స్తోమతు ఉండాలేమోగాని, స్నేహానికైతే ఇవేవీ అవసరం లేదనే విచక్షణా జ్ఞానం నశించిం దాయనకి ఆ క్షణంలో.

తన పిల్లలపై కోపం.

తన పేద తనాన్ని సవాలు చేస్తున్నట్లుగా ఉన్న ఆ శుభలేఖ పంపేవారిపై కసి, ద్వేషం, అసహ్యం. అంతే.

అందుకే ఆ శుభలేఖ విప్పి చదవాలనిపించలేదు!

ఎందుకో అతనికి అకస్మాత్తుగా ఆ శుభలేఖని చూసి అసూయ కలిగింది దానిపై.

అనుకోకుండానే కసితీరా ముక్కలు చేశారు.

అప్పటికి గాని ఆయన కోపం చల్లారలేదు.

అంతే. ఎంతో రిలీఫ్ వచ్చినట్లుగా ఫీలయ్యారు.

మళ్ళీ మామూలు ప్రపంచంలోకి రావడంతో చేతిలో ఉన్న కవరు గుర్తుకొచ్చి, తిరిగి శక్తినంతా గూడకట్టుకుని కవర్ని చింపబోయిన తనే తన కళ్ళని నమ్మలేకపోయారు 'ఫ్రమ్' అడ్రెస్ చూసి.

ఇన్‌ష్యూర్ చేయబడ్డ కవరది. అందుకు కారణం వెదక్కుండానే, ఆనందంతో చేతులు వణుకుతుంటే, ఆత్రతగా చించిన ఆయనకి, కవరులో ఉన్న కాగితాలను చూస్తే ఏం అర్థంకాలేదు.

తను కలగాని కనటం లేదు కదా?

లేకపోతే ఈ వంద రూపాయలేమిటి!

తెల్లగా ఓ కాగితం కనబడటంతో తొందరపాటుతో విప్పారు — అందులోనైనా ఆ డబ్బుకి అర్థం ఉంటుందేమోనని.

"డియర్ జోగీ!

ఎలా ఉన్నావ్? ఉత్తరం వ్రాయడం చాలా లేటయిందని ఎంతో బాధపడుతున్నాను. ముందు నన్ను క్షమిస్తావు కదూ? కారణాలన్నీ తరవాత. జోగీ! నిన్ను చూడాలని ఎంత ఇదిగా ఉందో తెలుసా? ఉత్తరం అందిన వెంటనే బయలుదేరుతావ్ కదూ? ఈ కవరులో ఉన్న వంద రూపాయలేమిటని ఆశ్చర్యపోకు. సమయానికి నీ దగ్గర ఉండకపోవచ్చునని పంపించా నంతే. కాకపోతే అప్పనుకో. . . కాని, ఇంకోలా భావిస్తే నేను చాలా బాధపడతాను.

ఒరేయ్, జోగీ! వచ్చే వారమే శేఖర్ పెళ్ళి. నేనే వద్దా మనుకున్నా కాని, క్షణం తీరిక లేదు. నేను ప్రత్యేకంగా రాకుండా కేవలం శుభలేఖ పంపించానని అనుకోకు. అది నీకోసం ప్రత్యేకంగా ..."

ఆ పైన చదవలేక పోయారు.

తల తిరిగినట్లైంది.

కళ్ళు నీళ్ళతో నిండుకోగా, తన చేతలారా చింపిన శుభలేఖ ముక్కలపై— "నీ కోసం ప్రత్యేకంగా ..." అన్నట్లు ముత్యాల్లా మెరుస్తున్న అక్షరాలు మసకగా కనిపించాయి.

"భగవాన్! అది రాజు పంపింది కాదు కదా!" కళ్ళ వెంట నీళ్ళు వర్షిస్తుంటే భగవంతుని తలుచుకున్నారు దీనంగా, అది ఆ శుభలేఖ కాకూడదని.

అంతలో ఏదో స్ఫురించింది మనసులో.

గబుక్కున తన చేతిలో ఇంకా సజీవంగా ఉన్న, శుభలేఖ ఉంచబడిన కవరుపై ఫ్రమ్ అడ్రెస్‌కోసం చూశారు.

అంతే "రాజా!" అని కూలబడ్డారక్కడే!

'రాజా! నా పెళ్ళికి ఓ ఖరీదైన ఉంగరాన్ని ప్రజంట్ చేసి మన స్నేహం చిరస్థాయి కావాలని కోరుకునే నీకు, నీ కుమారుని పెళ్ళికోసం ఎర్రని గులాబి పువ్వైనా కొని పంపించలేని అభాగ్యుణ్ణి, గర్భదరిద్రుణ్ణి, రాజా! నా దారిద్ర్యాన్ని ఊహించే నీ కొడుకు పెళ్ళికి రాలేనేమోనని వంద రూపాయలు పంపించావా, రాజా? కాని ... కాని, రాజా, నన్ను చూడాలనే కోరికతో, నీ అబ్బాయ్ పెళ్ళికి తప్పకుండా నేను రావాలనే ఉద్దేశ్యంతో నాపై అభిమానం కొద్దీ నువ్వలా పంపించావే తప్ప నీలో మరో ఉద్దేశ్యం లేకపోయినప్పటికీ ... నా కో మనస్సుంది రాజా! ఆ మనసుకి వాటిని

# చరిత్ర కందని అమర వీరులు

# మండపాక రంగయ్య నాయుడు

అతడు బళ్ళారి జైలులో ఎప్పుడూ రాళ్ళూ, రప్పలూ పోగుచేస్తూ ఉండేవాడు. అంతకుముందు అతను ఆ జైల్లోకి ఆరుసార్లు వచ్చాడు. ఇది ఏడవ సారి. అప్పటికే అతని వయస్సు అరవై సంవత్సరాలు దాటింది. అంత వృద్ధుడైనా సరదాగా, స్వంతంగా రాళ్ళు మొదలైన వాటిని సేకరించి మెట్లు నిర్మిస్తుండేవాడు. సున్నం ఎక్కడినుండో తెచ్చేవాడు. రాళ్ళను మరెక్కడినుండో తెచ్చేవాడు. అతను ఎలా ఎందుకు చేస్తున్నాడో జైల్లో ఉంటున్న సహచరులెవ్వరికీ తెలియదు. అతను ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. పరధ్యానంగా ఉండేవాడు.

ఆయన అలా ఎందుకు చేస్తున్నదీ తెలియక అతనికి మతి భ్రమించిందని అనుకునేవారు అందరు. అప్పటికే ఆయనను ఉబ్బసం జబ్బు పట్టి పీడించసాగింది. అతను చేసే పని ఎవరికీ నచ్చలేదు. జైలు అధికార్లు కూడా ఇతని పనిని చూసి చివాట్లు పెట్టారు.

కొన్ని మాసాల తరవాత 16 వ బ్లాక్ గేటు దగ్గర హాస్పిటల్, బావి దగ్గర అరుగులూ, పోపానాలూ పూర్తి అయిపోయాయి. అప్పుడతనిలోని సంతోషానికి అవధులు లేవు.

అతను తన మిత్రులందర్నీ పిలిచి—

"ఈ గేటుకు ఎడమ ప్రక్కన మండపాక రంగయ్య నాయుడు జ్ఞాపకార్థం నిర్మాణం చేశాను. కుడిప్రక్క జైలులో జరిగిన లాఠీచార్జికి జ్ఞాపక చిహ్నం. బావి దగ్గర 'బా'—కస్తూరిబా జ్ఞాపకార్థం ..." అన్నాడు.

అప్పుడు కాని అతడు పడ్డ శ్రమను గూర్చి తెలియలేదు అతనిమిత్రులకు. ఆ వృద్ధ స్వాతంత్ర్యయోధుడు జైల్లో తన మిత్రులనూ, స్వాతంత్ర్య సమర యోధులనూ జ్ఞాపకం చేసుకుంటూ కాలం గడిపేవాడు.

ఇలా అరవై సంవత్సరాల వృద్ధాప్యంలో కూడా జైల్లో ఎంతో హుషారుగా జీవితాన్ని గడిపిన స్వాతంత్ర్య సమర యోధుడే మండపాక రంగయ్య నాయుడు. ఇతని జన్మస్థానం ఆంధ్ర ప్రదేశ్‌లోని పిఠాపురం దగ్గరి చంద్రపాలెం అనే కుగ్రామం. ఇతని తండ్రి సామాన్య రైతు. అందువల్ల ఇతనికి ఉన్నత విద్య చెప్పించలేకపోయాడు. ఇతడు కొంతకాలానికి కాకినాడ పట్టణం చేరుకున్నాడు.

ఇతడు తన చిన్నతనం నుంచే ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చాడు. స్వయం కృషితో తెలుగుతో పాటు ఇంగ్లీషు, హిందూస్తానీ భాషలను నేర్చుకున్నాడు. జీవికకై ఉద్యోగం చేసుకుంటూనే ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చాడు.

1920 లో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని లేవదీసి భారత స్వాతంత్ర్య సమరంలో నూతన అధ్యాయాన్ని ఆరంభించాడు. గాంధీజీ పిలుపు అందుకొని దేశంలోని పలు ప్రాంతాల్లోని యువకులు వేలకువేలుగా సమర రంగంలోకి దూకారు. చదువులకు స్వస్తి చెప్పారూ, ఉద్యోగాలకు తిలోదకాలిచ్చారు. కోర్టులను బహిష్కరించారు ఎందరో న్యాయవాదులు.

విదేశీ ప్రభుత్వానికి స్వస్తి చెప్పడానికి, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించడానికి అహింసాయుత సమరం ముమ్మరంగా సాగుతూంది. కాకినాడలో ఎందరో జాతీయవాదుల్ని అరెస్టు చేశారు.

రంగయ్య నాయుడు కూడా నడుం కట్టి సమరంలోకి దూకాడు. అప్పుడు తూర్పు గోదావరి జిల్లాకు ఏకైకనాయకుడైన మహర్షిగా పేరు గాంచిన బులుసు సాంబమూర్తి ప్రక్కన నిలబడి ప్రభుత్వ విధానాన్ని ప్రతిఘటించాడు. అప్పుడితన్ని బంధించి సంవత్సరంపాటు జైల్లో పెట్టారు.

ఆ తరవాత 1923 లో జాతీయ కాంగ్రెస్ మహాసభలు కాకినాడలో జరిగినప్పుడు ఇతడు ఆహ్వాన సంఘం కార్యదర్శిగా పనిచేశాడు. పోలీసుల టోపీ కనిపిస్తేనే జనం హడలిపోయే రోజులవి. ఆనాడు కాంగ్రెస్ టోపీ ధరిస్తే నేరం. ఖద్దరు ధరించాలంటే ఎంతో సాహసం కావాలి. అలాంటి రోజుల్లో కాంగ్రెస్ ఆహ్వాన సంఘం కార్యకలాపాల్ని నిర్వహించిన ధైర్యశాలి ఈయన.

## ఎ. పండరినాథ్

ప్రభుత్వానికి బయపడి ఆహ్వాన సంఘం కరపత్రాల్ని అచ్చువెయ్యడానికి అక్కడి ప్రెస్ వాళ్ళందరూ నిరాకరించారు. అప్పుడితను ధైర్యంచేసి కొందరు స్నేహితులను కూడదీసుకొని ఒక ప్రెస్‌ను స్థాపించి కార్యకలాపాల్ని నిరాటంకంగా సాగించాడు.

1930 సత్యాగ్రహోద్యమంలో తూర్పు గోదావరి జిల్లాకు కాకినాడ ముఖ్యకేంద్రం. అప్పుడు ప్రపంచ చరిత్రలో కనీ వినీ ఎరుగని సత్యాగ్రహ సమరం చెలరేగుతోంది భారత దేశంలో.

ఆంధ్రప్రాంతంలో కూడా సత్యాగ్రహ సమర సైనికులు 1000 నుండి 1500 దాకా శాంతి సమరాన్ని జరపడానికి సన్నద్ధులై ఉన్నారు. ఇలా నిరాయుధులైన శాంతి సైనికులు సాయుధ పోలీసు దళాలను ప్రతిఘటించి ఉప్పు కొఠారులపైకి దాడి చేస్తున్నారు. అదొక యుద్ధ రంగంగా పరిణమించింది. ఈ శాంతి సమరంలో పాల్గొన్న సైన్యానికి సాంబమూర్తితోపాటు రంగయ్య నాయుడు నాయకత్వం వహిస్తున్నాడు. పోలీసులు నిర్దాక్షిణ్యంగా ప్రజలపైబడి లాఠీలతో చావ మోదుతున్నారు. ఇలాంటి భయంకర సమయంలో ఈ స్వాతంత్ర్య సమర యోధుడు విప్లవ సమరాన్ని ముందుకు నడిపించాడు.

ప్రభుత్వం ఎందరినో అరెస్టుచేసి జైల్లో పెట్టింది. రంగయ్యనాయుడు ఈ సందర్భంలో ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్షను అనుభవించాడు. ఇలా ఇతను ప్రతి జాతీయోద్యమంలో పాల్గొంటూ విప్లవ ధీరుడిగా జీవితాన్ని గడుపసాగాడు.

1941 లో గాంధీజీ వ్యక్తి సత్యాగ్రహాన్ని ప్రారంభించినప్పుడు రంగయ్య నాయుడు తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ సంఘం అధ్యక్షుడు. ఈ ప్రాంతంలో సత్యాగ్రహ ప్రమాణపత్రంపై మొట్టమొదటి సత్యాగ్రహిగా సంతకం చేశాడు. సామ్రాజ్యవాదులకు ఏ విధంగానూ సహాయం చెయ్యరాదని ఎలుగెత్తి చాటాడు. అప్పుడితన్ని అరెస్టు చేసి రెండు సంవత్సరాలు జైల్లో పెట్టింది. 300 రూపాయల జరిమానా విధించింది.

కలెక్టర్ ఇతనిపై కక్షబూని బళ్ళారి జైల్లో ఇతనికి 'సి' క్లాస్ ఇచ్చాడు. సుమారు డెబ్భై సంవత్సరాల వయస్సులో ఉన్న రంగయ్య నాయుడికి 'సి' క్లాస్ జైలు జీవితం ఎలా సరిపడుతుంది? ఎంతో విశ్రాంతి తీసుకుంటూ హాయిగా ఉండే వయస్సు అది. జైలులో ఆయన ఆరోగ్యం నానాటికీ క్షీణించసాగింది. అయినా, జైలు అధికార్లు అతని ఆరోగ్యం గూర్చి ఏమాత్రం శ్రద్ధ వహించలేదు. ఒక రోజు తెల్లవారుజామున గుండెల్లో బరువుగా ఉందని చెప్పాడు. అప్పటికప్పుడే మెదడులోనుంచి రక్తం కారసాగింది. మరుక్షణమే ఆయన చివరి శ్వాసను విడిచాడు.

దేశంకోసం తన కుటుంబ క్షేమాన్ని కూడా లెక్కచెయ్యని నిస్వార్థ దేశభక్తుడీయన. ✱

---

స్వీకరించేస్మి, నువ్వు కోరినట్టు రాగలిగే విశాలభావం లేదు, రాజా! ఈ దౌర్భాగ్యుణ్ణి క్షమించు, రాజా! నీ వంద రూపాయలూ నీకే పంపించేస్తున్నాను' శుభలేఖ ముక్కల్ని ఏరుతూ విలపించారు.

ఎప్పుడొచ్చాడో? తన చేతిలోని వంద రూపాయల్ని చేజిక్కించుకొని, "చూడవయ్యా! రెండు మాసాల ఇంటి అద్దెకి వంద పోతే ఇంకా ఇరవై వస్తాయ్. నాలుగు రోజుల్లో ఇచ్చేయ్, అవసరముంది నాకు" అంటూ అవకాశాన్ని వినియోగించుకొని పెద్ద అడుగు లేసుకుంటూ పోతున్న ఇంటి యజమాని వైపు పిచ్చిగా చూస్తుంటే— "ఆఁ. మరిచిపోయాను చెప్పటం—మా అమ్మాయికి పెళ్ళి" అంటూ శుభలేఖని ఆయన ముఖం మీద విసిరి పోయాడు ఆ ఇంటి యజమాని.

రివ్వుమంటూ వీథిలోంచి వచ్చిన గాలికి కింద నున్న శుభలేఖ ముక్కలు దూరంగా ఎగిరి పోతూంటే అలా చూస్తుండి పోయారు వాటి వైపు.

గంభీరంగా ఉన్న అతని ముఖంలోని భావాలు అర్థం కాక అతన్ని చూస్తుంది, అతని చేతిలో ఉన్న శుభలేఖ. ✱